పారిశుద్ధ్యం.. అధ్వానం!

- చిట్టడవులను తలపిస్తున్న ఖాళీ స్థలాలు
- పందులు, పశువుల స్వైరవిహారం
- డ్రైనేజీల్లో వ్యర్థాల వెలికితీత నామమాత్రం
- ప్రతాపం చూపుతున్న దోమలు, ఈగలు
- అంటు రోగాల భయంలో మంగళగిరి ప్రజలు


కొద్దిపాటి వర్షానికే చెరువును తలపిస్తున్న రహదారి

మంగళగిరి: మంగళగిరి తాడేపల్లి మున్సిపల్ కార్పొరేషన్ (ఎంటీఎంసీ)లో పారిశుద్ధ్యం అధ్వానంగా మారింది. మంగళగిరి, తాడేపల్లితో పాటు విలీన గ్రామాలలో 1,200కుపైగా ఖాళీ స్థలాలను గుర్తించిన అధికారులు వాటి యజమానులపై మాత్రం పర్యవేక్షణ విషయంలో ఎలాంటి చర్యలూ తీసుకోవడం లేదనే విమర్శలున్నాయి. ఖాళీ స్థలాల్లో పిచ్చిచెట్లు పెరిగి చిట్టడవులను తలపిస్తున్నాయి. మురికి కూపాలుగా మారి పందులకు, పశువులకు నిలయాలుగా మారాయి. రోడ్ల వెంట పశువులు అడ్డగోలుగా తిరగడం సర్వసాధారణంగా మారింది. నగరంలో ఖాళీ స్థలాలను గుర్తించిన అధికారులు వాటి యజమానులకు నోటీసులు జారీ చేసి చేతులు దులుపుకొంటున్నారు. ఖాళీ స్థలాల కారణంగా చుట్టుపక్కల నివాసితులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఇళ్ల వెంట మురుగు నిల్వలతో దోమలు, ఈగలు విజృంభిస్తున్నాయి. ప్రజలు అంటురోగాల బారిన పడతామని ఆందోళన చెందుతున్నారు.

పెరిగిన రోగుల సంఖ్య

వైఎస్సార్ సీపీ ప్రభుత్వ పాలనలో ప్రజలకు ఇంటి వద్దే వైద్య సేవలందించాలనే లక్ష్యంతో నిర్మించిన వైఎస్సార్ అర్బన్ హెల్త్ సెంటర్‌లకు రోజురోజుకు పెరుగుతున్న రోగుల సంఖ్య ఆందోళన కలిగిస్తోంది. ప్రభుత్వం నిర్లక్ష్యంతో ప్రజలకు ఇక్కడ కూడా సరైన వైద్యసేవలు అందించడం లేదనే ఆరోపణలున్నాయి. ఎంటీఎంసీ పరిధిలోని ఖాళీ స్థలాలను చదును చేసి మెరక తోలేలా యజమానులకు ఆదేశాలు ఇవ్వాలని ప్రజలు కోరుతున్నారు. లేదంటే మున్సిపల్ అధికారులు ఖాళీ స్థలాలను శుభ్రపరచి యజమానుల నుంచి జరిమానా రూపంలో ఆ ఖర్చు వసూలు చేయాలని పేర్కొంటున్నారు. తమ ఆరోగ్యాన్ని కాపాడాలని ప్రజలు కోరుతున్నారు. పందులు, పశువుల యజమానులకు ఎలాంటి నోటీసులు జారీ చేసినా స్పందించకుంటే కార్పొరేషన్ ఆధ్వర్యంలో వాటిని నగరం నుంచి తరలించేలా చర్యలు తీసుకోవాలని విన్నవిస్తున్నారు. నగరంలో చిన్న వర్షం కురిసినా రోడ్లు జలమయంగా మారకుండా మురుగు కాల్వలలో పూడిక తీయాల్సిన అవసరం ఉంది. కానీ చాలాచోట్ల చెత్త తీయకపోవడంతో మురుగునీరు నిల్వ ఉంటోంది. వాన పడినప్పుడు వ్యర్థాలన్నీ రోడ్లపైకి చేరి మరీ ఇబ్బందికరంగా పరిస్థితి మారుతోంది. వాననీరు కూడా రోడ్లపై నిలిచి పరిస్థితి చెరువులను తలపిస్తోంది. ఇప్పటికే పలు ఇతర ప్రాంతాల్లో ప్రజలు డయేరియాతోపాటు డెంగీ, మలేరియా వంటి జ్వరాలతో అనారోగ్యం పాలవుతున్నారు. కొత్తగా ఏర్పడిన ఎంటీఎంసీలో పారిశుద్ధ్య నిర్వహణ మరింత సమర్థంగా చేపట్టాల్సి ఉందని ప్రజలు పేర్కొంటున్నారు. ప్రజలు వ్యాధుల బారినపడకుండా తగిన చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.


చిట్టడవిలా నగరంలోని ఓ ఖాళీ స్థలం


రోడ్లపై యథేచ్ఛగా సంచరిస్తున్న పశువులు


మురుగు కాలువలో పూడిక తీసి రోడ్డుపైనే వదిలేసిన దృశ్యం

కొత్త కమిషనర్ దృష్టి సారిస్తేనే..



మంగళగిరి తాడేపల్లి మున్సిపల్ కమిషనర్‌గా సోమవారం బాధ్యతలు చేపట్టనున్న అలీం బాషాకు సమస్యలు స్వాగతం పలుకుతున్నాయి. సీఆర్‌డీఏలో అదనపు కమిషనర్‌గా పనిచేసిన ఆయన ఇక్కడ కమిషనర్‌గా బాధ్యతలు చేపట్టనున్నారు. ఆయన వచ్చాకైనా ఈ సమస్యలపై దృష్టి సారిస్తారా? అని నగరవాసులు ఎదురు చూస్తున్నారు. గతంలో పనిచేసిన కమిషనర్ ఇక్కడి ప్రజా సమస్యలపై ప్రత్యేక దృష్టి సారించినా.. ఫలితాలు పూర్తి స్థాయిలో రాలేదని ప్రజలు వాపోతున్నారు. రాష్ట్రంలోనే అత్యధిక విస్తీర్ణం కలిగిన ఎంటీఎంసీలో గత ప్రభుత్వం ఉన్నప్పుడు ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి(ఆర్కే) ఆధ్వర్యంలో మౌలిక వసతులపై దృష్టి సారించారు. నగర అభివృద్ధికి ఆర్కే పాటుపడ్డారు. నేటి పాలకులు కూడా అదేస్థాయిలో కృషి చేయాలని నగరవాసులు ఆకాంక్షిస్తున్నారు.

క్లుప్తంగా

నేరాలకు పాల్పడితే కఠిన చర్యలు



మంగళగిరి : రౌడీషీటర్లు అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని రూరల్ ఎస్ఐ చిరుమామిళ్ళ వెంకట్ హెచ్చరించారు. ఆదివారం రూరల్ పరిధిలోని రౌడీషీటర్లకు కౌన్సెలింగ్ నిర్వహించారు. భూదందాలు, సెటిల్‌మెంట్‌లు, అధిక వడ్డీల వసూలు వంటి కార్యకలాపాలకు ఎవరైనా పాల్పడితే బాధితులు నేరుగా తమకు ఫిర్యాదు చేయాలని సూచించారు. బాధ్యులపై కఠిన చర్యలు తీసుకుంటామన్నారు.

పచ్చదనం పెంపు ఎంతో అవసరం



మంగళగిరి : నగరంలో పచ్చదనం పరిరక్షణ ఎంతో కీలకమని, ఆ మేరకు తమవంతుగా మొక్కల పంపిణీ కార్యక్రమం చేపట్టినట్లు 'పచ్చదనం.. పరిరక్షణ బృందం' సభ్యులు తెలిపారు. ఆదివారం పట్టణంలో మిద్దె సెంటర్‌లో వివిధ మొక్కలను వారు ప్రజలకు ఉచితంగా అందించారు. వాటిని పెంచి చెట్లుగా మారే వరకు పరిరక్షించాలని కోరారు. కార్యక్రమంలో బృందం సభ్యులు ఆకురాతి కోదండ రామయ్య, జగన్నాథం శ్రీనివాసరావు, చింత క్రింది సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

అంబులెన్స్‌లు అందుబాటులోకి తేవడం అభినందనీయం



మంగళగిరి : ప్రజల ప్రాణాలు కాపాడటంలో అంబులెన్స్‌లు ఎంతో ఉపయోగపడతాయని, వాటిని అందుబాటులోకి తీసుకురావడం అభినందనీయమని మాజీ కార్పొరేటర్, సీపీఐ విజయవాడ నగర కార్యదర్శి జి. కోటేశ్వరరావు పేర్కొన్నారు. పట్టణంలో ఎయిమ్స్ ఆసుపత్రి వద్ద ఆదివారం ఏఐటీయూసీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఆటో స్టాండ్‌ను కోటేశ్వరరావు ప్రారంభించారు. ఇక్కడ అంబులెన్స్‌లు కూడా అందుబాటులో ఉంచారు. దీంతో స్థానిక నాయకులను అభినందించారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ నాయకులు అన్నవరపు ప్రభాకర్, సీపీఐ నాయకులు పుప్పాల సత్యనారాయణ, చిన్ని తిరుపతయ్య, నందం బ్రహ్మేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

ఉచిత వైద్య శిబిరానికి స్పందన



తాడికొండ: తాడికొండ సత్యసాయి హైస్కూల్‌లో ఆదివారం కాటూరి ఆసుపత్రి ఆధ్వర్యంలో నిర్వహించిన ఉచిత వైద్య శిబిరానికి స్పందన లభించింది. బండ్ల కోటేశ్వరరావు మిత్ర మండలి ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ శిబిరంలో 200 మందికిపైగా పాల్గొన్నారు. ఈసీజీ, షుగరు, బీపీ, జనరల్ మెడిసిన్, ఎముకలకు సంబంధించిన పరీక్షలు ఉచితంగా చేయించుకున్నారు. అవసరమైన వారికి మందులు పంపిణీ చేశారు. పెద్ద సమస్యలు గుర్తించిన వారికి తాత్కాలికంగా మందులు అందించారు. త్వరలో ఉచిత బస్సు సౌకర్యం ఏర్పాటు చేసి పెద్ద పరీక్షలు, శస్త్ర చికిత్సలు నిర్వహించనున్నట్లు వైద్యులు తెలిపారు. కార్యక్రమంలో నిర్వాహకులు బండ్ల కోటేశ్వరరావు, ధనేకుల హరిబాబు, షేక్ రఫీ, ఫజల్, నన్నేషా, మిక్కిలి కిరణ్, ఉండవల్లి రాజేష్, చొప్పర యాకోబు, సీరుకొండ పెద్దబ్బాయి, ధనేకుల నాగేశ్వరరావు, కంతేటి అంజయ్య, నాంచారయ్య, చిన్న, తిరుపతిరావు తదితరులు పాల్గొన్నారు.

జీవనశైలిలో మార్పులే జీర్ణకోశ వ్యాధులకు మూలం

లక్ష్మీపురం: పెరిగిపోతున్న లివర్, జీర్ణకోశ వ్యాధులకు జీవనశైలిలో మార్పులు, వాతావరణ కాలుష్యం కారణమని ప్రముఖ గ్యాస్ట్రో ఎంటరాలజిస్ట్ డాక్టర్ వీరేంద్ర యశస్వి పేర్కొన్నారు. స్థానిక అరండల్ పేటలోని అవగాహన సంస్థ కార్యాలయంలో సంస్థ కార్యదర్శి కొండా శివరామిరెడ్డి ఆధ్వర్యంలో ఆదివారం ఏర్పాటు చేసిన ఆరోగ్య సభలో ఆయన మాట్లాడారు. గ్యాస్ ట్రబుల్ అని భావించి ఏదో ఒక ఔషధం తీసుకోవడం వల్ల చిన్న సమస్యలు ప్రాణాంతకంగా మారే ప్రమాదం ఉందని ఆయన హెచ్చరించారు. ఆహారంలో మైదా శాతాన్ని చాలా తగ్గించాలన్నారు. నూనెలు నాణ్యత కలిగినవి ఉపయోగించాలని సూచించారు. బీపీ, మధుమేహం అదుపులో ఉంచుకోవాలని, లేకుంటే శరీరంలో అన్ని భాగాలకు సమస్యలు తలెత్తుతాయని వివరించారు. టీవీ సాయిరాం కో–ఆర్డినేటర్‌గా వ్యవహరించారు.

ఘనంగా గంగానమ్మ ఆలయ పునఃప్రారంభోత్సవం

మంత్రి లోకేష్ దంపతుల పూజలు


పూజలు నిర్వహిస్తున్న నారా లోకేష్ దంపతులు

తాడేపల్లి రూరల్ : ఎంటీఎంసీ పరిధిలోని తాడేపల్లి పట్టణం నేతాజీ సెంటర్‌లో వేంచేసియున్న శ్రీ గంగానమ్మ దేవస్థానం పునః ప్రారంభోత్సవాన్ని ఆదివారం వైభవంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి రాష్ట్ర విద్య, ఐటీ శాఖల మంత్రి, మంగళగిరి ఎమ్మెల్యే నారా లోకేష్ సతీసమేతంగా విచ్చేశారు. ప్రత్యేక పూజా కార్యక్రమాల్లో పాల్గొన్నారు. మంత్రి లోకేష్ మాట్లాడుతూ సమృద్ధిగా వర్షాలు కురిసి ప్రజలు సుభిక్షంగా ఉండేలా చూడాలని కోరుతూ ఏటా ఆషాఢమాసంలో గంగానమ్మ తల్లి ఉత్సవాలు నిర్వహించడం హర్షణీయం అన్నారు. ఆలయ అభివృద్ధికి తనవంతు సహాయసహకారాలు అందిస్తానని పేర్కొన్నారు. అనంతరం నిర్వహించిన అన్నదాన కార్యక్రమంలో లోకేష్ దంపతులు పాల్గొన్నారు. తాడేపల్లికి చెందిన సీనియర్ నేత దొంతిరెడ్డి సాంబిరెడ్డి నేతృత్వంలో ఇటీవల ఆలయాన్ని పునర్నిర్మించడం అభినందనీయమని, ఆయనకు కమిటీ సభ్యులకు ప్రత్యేక అభినందనలు తెలుపుతున్నట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కమిటీ సభ్యులు చింతా శ్రీరామ్, పలగాని నాగబాబు, తాడిబోయిన నాగ వెంకటేశ్వరరావు(బాబు), టీడీపీ నియోజకవర్గ సమన్వయకర్త నందం అబద్దయ్య, జనసేన నియోజకవర్గ సమన్వయకర్త చిల్లపల్లి శ్రీనివాస్, టీడీపీ తాడేపల్లి టౌన్ అధ్యక్షులు వల్లభనేని వెంకట్రావు తదితరులు పాల్గొన్నారు.

రైతుల పిల్లలకు ఉచితంగా సీట్లు కేటాయించాలి

ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి ఎం. కిరణ్



ఎన్నికైన ఎస్ఎఫ్ఐ తుళ్ళూరు మండల కమిటీ

తాడికొండ: రాజధానికి భూములిచ్చిన రైతుల పిల్లలకు ఇక్కడి విద్యాసంస్థల్లో బీటెక్‌లో ఉచితంగా 10 శాతం సీట్లు ఇవ్వాలని ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి ఎం. కిరణ్ డిమాండ్ చేశారు. ఎస్ఎఫ్ఐ తుళ్ళూరు మండల కమిటీని ఎన్నుకున్నట్లు ఆయన ఆదివారం తెలిపారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. మండల అధ్యక్ష, కార్యదర్శులుగా ఎన్. గోపీచంద్, బి.బాబు, ఉపాధ్యక్షులుగా ఎస్. హర్షవర్ధన్, పి. సుభాష్, సహాయ కార్యదర్శులుగా ఎల్. బాబి, కె. పూర్ణ, ఆకాష్ ఎన్నికైనట్లు పేర్కొన్నారు. రాజధాని ప్రాంత రైతుల కుటుంబానికి చెందిన విద్యార్థులకు ప్రైవేటు విశ్వవిద్యాలయాల్లో ఉచితంగా సీట్లు కేటాయించాలనే నిబంధనతో నాడు భూములు స్వీకరించారని గుర్తు చేశారు. నేడు బీటెక్ కౌన్సెలింగ్ జరుగుతున్న నేపథ్యంలో విద్యార్థులకు ఉచితంగా 10 శాతం సీట్లు ఇవ్వాలని డిమాండ్ చేశారు. తుళ్ళూరు పరిసర ప్రాంతాల్లోని పాఠశాలలు, కళాశాలలను అభివృద్ధి చేయాలన్నారు. విద్యా సంవత్సరం ప్రారంభమై నెల కావస్తున్నా పూర్తి స్థాయిలో పాఠ్య పుస్తకాలు, కిట్లు బడుల్లో అందలేదన్నారు. అధికారులు వెంటనే స్పందించాలని డిమాండ్ చేశారు. డిగ్రీ ఆన్‌లైన్ అప్లికేషన్ వల్ల ఎక్కువ మంది విద్యార్థులు నష్టపోతున్నారని, వెంటనే ఆ ప్రక్రియను రద్దు చేయాలని పేర్కొన్నారు. జీవో నెంబర్ 77ను రద్దు చేసి ఉన్నత విద్య చదివేందుకు విద్యార్థులను ప్రోత్సహించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా మాజీ అధ్యక్షులు ఎం. బాలాజీ, నాయకులు వినయ్, బి. రామ్ చరణ్, సాయి, నాయక్, శశాంక్, రాఘవ తదితరులు పాల్గొన్నారు.

జీజీహెచ్‌లో ప్లాస్టిక్ సర్జరీ డే వేడుకలు

ఎనిమిది మందికి ఆపరేషన్లు


కేక్ కట్ చేస్తున్న డాక్టర్ కిరణ్‌కుమార్, డాక్టర్ సుమితా శంకర్

గుంటూరు మెడికల్: గుంటూరు జీజీహెచ్‌లో ఆదివారం ప్రపంచ ప్లాస్టిక్ సర్జరీ దినోత్సవం నిర్వహించారు. ప్లాస్టిక్ సర్జరీ విభాగాధిపతి డాక్టర్ సుమిత శంకర్‌తో కలిసి సూపరింటెండెంట్ డాక్టర్ ఏకుల కిరణ్ కుమార్ కేక్ కట్ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్లాస్టిక్ సర్జరీ వల్ల కలిగే ప్రయోజనాలు, పురోగతి గురించి అవగాహన కల్పించే లక్ష్యంతో ఉచిత శస్త్రచికిత్స శిబిరం నిర్వహించామని తెలిపారు. ప్లాస్టిక్ సర్జరీ విభాగాన్ని ఉన్నత శిఖరాలకు తీసుకెళ్లడంలో డాక్టర్ సుమితా శంకర్ గణనీయమైన కృషి చేస్తున్నారని కొనియాడారు. ఫాసియోమాక్సిల్లరీ ట్రామా, హ్యాండ్, ఫింగర్ రీప్లాంటేషన్, ఫ్యాట్ గ్రాఫ్టింగ్, ఆంకోప్లాస్టీ , ఆర్థోప్లాస్టీ రీకన్‌స్ట్రక్టివ్ వంటి కాస్మొటిక్ సర్జరీలను జీజీహెచ్‌లో కార్పొరేట్ ఆస్పత్రుల కంటే దీటుగా పూర్తి ఉచితంగా చేస్తున్నారని తెలిపారు.

ఎనిమిది మందికి శస్త్ర చికిత్సలు

రాష్ట్రంలో అత్యధిక సంఖ్యలో పోస్ట్‌గ్రాడ్యుయేట్ విద్యార్థులతో ప్లాస్టిక్ సర్జరీ వైద్య విభాగంలో సేవలను విస్తరిస్తున్నాని సూపరింటెండెంట్ కిరణ్ కుమార్ పేర్కొన్నారు. కాలిన గాయాలు, ప్లాస్టిక్ సర్జరీ కోసం ప్రత్యేకమైన యూనిట్లను, బ్రెస్ట్ క్లినిక్, డయాబెటిక్ ఫుట్ ఏర్పాటు చేస్తున్నట్లు వెల్లడించారు. వరల్డ్ ప్లాస్టిక్ డే సందర్భంగా ఆదివారం జీజీహెచ్‌లో డాక్టర్ ఎన్టీఆర్ ఆరోగ్య సేవా ట్రస్ట్ ద్వారా ఎనిమిది మంది రోగులకు శస్త్రచికిత్స చేశామని వెల్లడించారు. చీలిక పెదవి, సిండక్టిలీ, పోస్ట్–బర్న్ కాంట్రాక్చర్ కేసులతో పాటు, నరాల దెబ్బతినడం, ముఖ ఎముక పగుళ్లకు శస్త్ర చికిత్సలు చేస్తున్నట్లు తెలిపారు. డాక్టర్ సుమితా శంకర్ మాట్లాడుతూ తమ వైద్య విభాగంలో 10 మందికి పైగా వైద్యులు ఉన్నారని చెప్పారు. అధునాతన కేసులకు పరిధిని విస్తరించారని ఈ విభాగం రాష్ట్రం మొత్తానికి రెఫరల్ సెంటర్‌గా పని చేస్తుందన్నారు.

ఔట్‌సోర్సింగ్ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించండి

మంత్రి నాదెండ్లకు ఆర్టీసీ కార్మికుల వినతి


మంత్రి మనోహర్‌ను కలిసిన ఔట్ సోర్సింగ్ ఉద్యోగుల సంఘ నాయకులు

తెనాలిరూరల్: ఆర్టీసీలో ఔట్ సోర్సింగ్ విధానంలో పనిచేస్తున్న ఉద్యోగులు తమ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్‌కు విజ్ఞప్తి చేశారు. పపట్టణంలోని బోస్ రోడ్డులో ఉన్న మంత్రి కార్యాలయంలో ఏపీఎస్ ఆర్టీసీ ఔట్ సోర్సింగ్ ఎంప్లాయీస్ అసోసియేషన్ ప్రతినిధులు శనివారం రాత్రి మంత్రికి సమస్యలను విన్నవించారు. అసోసియేషన్ రాష్ట్ర కోశాధికారి పి.సుధీర్‌కుమార్ మాట్లాడుతూ థర్డ్ పార్టీ విధానంలో ఆర్టీసీలో 7,300 మంది కార్మికులు పని చేస్తున్నారని తెలిపారు. ఈ విధానం వల్ల చాలా నష్టపోతున్నామన్నారు. థర్డ్ పార్టీ విధానాన్ని రద్దు చేసి, నేరుగా సంస్థ నుంచి జీతం వచ్చేలా చర్యలు తీసుకుని ఉద్యోగ భద్రత కల్పించాలని కోరారు.

ఆకట్టుకున్న ఇంద్రజాల ప్రదర్శన

నగరంపాలెం: స్థానిక బృందావన్ గార్డెన్ శ్రీ వెంకటేశ్వరస్వామి ఆలయ ప్రాంగణం అన్నమయ్య కళా వేదికపై ఏపీ మెజీషియన్స్ అసోసియేషన్, అమరావతి మ్యాజిక్ ఫెస్టివల్ 40వ ఇంద్రజాల మహోత్సవాలు ఆదివారం నిర్వహించారు. తొలుత ఆలయ అధ్యక్షుడు సీహెచ్ మస్తానయ్య, సహాయ కార్యదర్శి ఊటుకూరి నాగేశ్వరరావు జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. మెజీషియన్స్ ఇంద్రజాల ప్రదర్శనలు ప్రేక్షకులను అబ్బురపరిచాయి. అనంతరం అసోసియేషన్ సభ్యులను దేవాలయ పాలక మండలి సత్కరించింది. ఈ కార్యక్రమంలో సంస్థ అధ్యక్షులు జేవీఆర్, కార్యదర్శి డాక్టర్ ఆర్యల్, డాక్టర్ ఆర్ఎల్ ప్రసాద్ పాల్గొన్నారు.

నైపుణ్యాల మెరుగుకు ఉపాధ్యాయులకు శిక్షణ


ఉపాధ్యాయులతో రిసోర్స్ పర్సన్లు

గుంటూరు ఎడ్యుకేషన్: లక్ష్మీపురంలోని శ్రీ పాటిబండ్ల సీతారామయ్య సీబీఎస్ఈ పాఠశాల ఉపాధ్యాయులకు విజయవాడలోని సీబీఎస్ఈ ప్రాంతీయ కార్యాలయంలో శని, ఆదివారాల్లో ఎక్స్‌పీరియెన్షియల్ లెర్నింగ్ శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి రిసోర్స్ పర్సన్లుగా వివా స్కూల్ ప్రిన్సిపల్ చదలవాడ సరళ, ఢిల్లీ పబ్లిక్ స్కూల్ అకడమిక్ డైరెక్టర్ ఎస్.ఉమా శ్రీనివాసరావు వ్యవహరించారు. విద్యార్థుల్లోని నైపుణ్యాన్ని పెంపొందించడానికి బ్లూమ్స్ టాక్సానమి పద్ధతిలో ఆర్కా, ఎక్స్‌పీరియెన్షియల్ లెర్నింగ్, మల్టిపుల్ ఇంటెలిజెన్స్ తదితర అంశాల్లో ఉపాధ్యాయులకు శిక్షణ ఇచ్చారు. కళాశాల కరస్పాండెంట్ విష్ణువర్ధన్ మాట్లాడుతూ మారుతున్న విద్యా విధానానికి అనుగుణంగా ఉపాధ్యాయులు బోధన పద్ధతులు మార్చుకునేలా, సీబీఎస్ఈ సీఓఈ శిక్షణ కార్యక్రమాలు నిర్వహించడం విద్యార్థుల భవిష్యత్తుకు బంగారు బాట వేసినట్లువుతుందని అభిప్రాయపడ్డారు. తమ విలువైన సమయాన్ని ఉపాధ్యాయులకు శిక్షణనిచ్చేందుకు కేటాయించడంపై ఆయన కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో పాఠశాల పాలకవర్గ సభ్యుడు గింజుపల్లి వరప్రసాదరావు, అకడమిక్ డైరెక్టర్ లేళ్ల కృష్ణవేణి, ప్రిన్సిపల్ జంపని పద్మజ, ప్రైమరీ ప్రిన్సిపల్ కర్లపూడి పార్వతీదేవి, కో-ఆర్డినేటర్లు దుర్గా శ్యామ్, శ్రీదేవి, ఉపాధ్యాయ బృందం పాల్గొంది.

ఆర్‌యూబీ పనులు త్వరితగతిన ప్రారంభించాలి


సీపీఐ పతావిష్కరణలో నగర కార్యదర్శి మాల్యాద్రి, నాయకులు

లక్ష్మీపురం: గుంటూరు నగరంలో నెహ్రూ నగర్ నుంచి వెంకటాద్రి పేట మీదగా సంజీవనగర్ రైల్వే ట్రాక్ ఎప్పుడు రద్దీగా ఉండటం వల్ల అక్కడ రైల్వే అండర్ గ్రౌండ్ బ్రిడ్జి ఏర్పాటుపై దృష్టి పెట్టాలని సీపీఐ నగర కార్యదర్శి కోటా మాల్యాద్రి పేర్కొన్నారు. స్థానిక వెంకటాద్రి పేట సెంటర్‌లోని సీపీఐ పతాకావిష్కరణ ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విజయవాడ నుంచి గుంటూరు మీదుగా అనేక రైళ్లు, గూడ్స్‌లు పెరిగిందన్నారు. దీంతో ప్రతి ఐదు నిమిషాలకు ఒక రైలు వెళ్లడంతో రైల్వే గేటు వద్ద విద్యార్థులు, వివిధ పనులకు వెళ్లాల్సిన ప్రజలు నిలబడిపోవాల్సి వస్తోందన్నారు. ఇన్నర్ రింగ్ రోడ్ ఏర్పాటు చేసిన తర్వాత ఈ బ్రిడ్జి ప్రాధాన్యత పెరిగిందని చెప్పారు. ఎంపీ, కేంద్ర సహాయ మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ గుంటూరు నగరంలోని బ్రిడ్జిలపై దృష్టి పెట్టారని ఈ ట్రాక్ ప్రాధాన్యతను దృష్టిలో పెట్టుకొని త్వరగా పూర్తి చేసి నగర ప్రజలకు ఇబ్బందులను తొలగించాలని కోరారు. ఈ కార్యక్రమంలో 56వ డివిజన్ కార్యదర్శి పల్ల యేసురత్నం, పాతర్ల జాన్ ,దివెన్ కుమార్, రమేష్ ,డేవిడ్ ,ఏసు, బాబు, భాస్కర్, ఏసు పాదం, రమేష్ , రాంబాబు తదితరులు పాల్గొన్నారు .

చిరుధాన్యాలపై చిన్నచూపుతో అనారోగ్యం

స్వతంత్ర శాస్త్రవేత్త డాక్టర్ ఖాదర్‌వలి


మాట్లాడుతున్న డాక్టర్ ఖాదర్‌వలి

గుంటూరు రూరల్: పూర్వీకుల ఆహార అలవాటైన చిరుధాన్యాలను పక్కకు నెట్టి బియ్యం, గోధుమలు లాంటివి ఉపయోగించేలా మన జీవనశైలి మారిందని స్వతంత్ర శాస్త్రవేత్త డాక్టర్ ఖాదర్‌వలి తెలిపారు. ఆదివారం వట్టిచెరుకూరు మండలం పుల్లడిగుంటలోని రైతు నేస్తం ఫౌండేషన్‌లో ఏర్పాటు చేసిన చిరుధాన్యాలతో జీవనసిరి కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా మాటాడారు. విదేశీ ఆహారపు అలవాట్ల ఫలితమే నేడు మానవ సమాజాన్ని పట్టి పీడిస్తున్న అతి పెద్ద అనారోగ్యమని చెప్పారు. ప్రజల అవసరాలను పక్కకు నెట్టి అనుకరణలకు ప్రాధాన్యత ఇవ్వడానికి బానిసలు అయ్యామన్నారు. ప్లాస్టిక్ వాడకం, ప్రాసెసింగ్ ఫుడ్, జంక్ ఫుడ్ వంటివి అలవాటు చేసుకోవడంతో పాటు కృత్రిమ సౌందర్య సాధనాలను విపరీతంగా ఉపయోగించడం లాంటివి విదేశాల నుంచి మనం దిగుమతి చేసుకున్నవేనని తెలిపారు. మనలో ప్రతి ఒక్కరూ ఏదో ఒక అనారోగ్య సమస్యతో బాధపడుతున్నామని, అందుకు కారణం ఆహారపు అలవాట్లేనని చెప్పారు. గడచిన వందేళ్లలో మారిన జీవన విధానం, ఆహార ఉత్పత్తి పద్ధతి, తీసుకునే ఆహారంలో చోటు చేసుకున్న మార్పులే ఈ విపత్తుకి కారణమని చెప్పారు. ఈ సమస్యకు చిరుధాన్యాలు, కషాయాలే పరిష్కారమని అన్నారు. రైతు నేస్తం ఫౌండేషన్ ఆధ్వర్యంలో కర్షక్ సేవా కేంద్రం నిర్వహణలో ఈ కార్యక్రమాన్ని నిర్వహించటం సంతోషకరమన్నారు. 150 ఏళ్ల క్రితం మధుమేహం అంటే ఎవరికీ తెలియదని, కానీ నేడు దేశవ్యాప్తంగా ప్రతి 100 మందిలో 20–25 మంది దీనితో బాధ పడుతున్నారన్నారు. పుట్టే ప్రతి 100 మంది పిల్లల్లో 10 నుంచి 15 మంది బుద్ధి మాంద్యంతో ఉంటున్నారని వివరించారు. ఈ సమస్యలన్నింటికీ పోషకాలు లేని ఆహారం తీసుకోవడమే ప్రధాన కారణమని తెలిపారు. సంపూర్ణ ఆరోగ్యం కోసం చిరు ధాన్యాలతో పాటు కషాయాలను ఆహారంగా తీసుకుంటే ఆరు నెలల్లో ఆరోగ్యం మెరుగు పడుతుందని వివరించారు. పాలు, టీ, కాఫీ, ప్లాస్టిక్ కవర్లలో, శుద్ధిచేసిన ఆహారాలను మానేయాలని సూచించారు. మధుమేహం, బీపీ, థైరాయిడ్ వంటి రోగాలను నయం చేసే శక్తి చిరుధాన్యాలకు, కషాయాలకు ఉందని వివరించారు.

బైక్ ఢీకొని గుర్తు తెలియని వ్యక్తి మృతి


గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం

పెదకాకాని: బైక్ ఢీ కొని గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందిన ఘటన తక్కెళ్ళపాడు సమీపంలో జాతీయ రహదారిపై చోటు చేసుకుంది. పెదకాకాని మండలంలోని తక్కెళ్ళపాడు సమీపంలో జాతీయ రహదారిపై మృతదేహం ఉన్నట్లు పోలీసులకు సమాచారం అందింది. ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు ప్రమాదానికి గల కారణాలపై దర్యాప్తు చేపట్టారు. ఆ ప్రదేశంలో యూనికార్న్ బైక్ పడి ఉంది. రోడ్డుపై నడిచి వెళుతున్న వ్యక్తిని విజయవాడ వైపు నుంచి చిలకలూరిపేట వైపు వెళ్లే రోడ్డులో బైక్‌పై వెళుతున్న వ్యక్తి అజాగ్రత్తగా నడిపి ఢీ కొనడం కారణంగానే తీవ్రగాయాలై చనిపోయి ఉంటాడని భావిస్తున్నారు. సుమారు 35 సంవత్సరాల వయస్సు కలిగిన మృతుని వద్ద ఎటువంటి ఆధారాలు లభ్యం కాలేదు. మృతదేహాన్ని గుంటూరు ప్రభుత్వ ఆసుపత్రిలోని మార్చురీ విభాగానికి తరలించారు. తక్కెళ్ళపాడు వీఆర్ఏ షేక్ లాల్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ కె.వీరాస్వామి తెలిపారు.